# కలిత కలశం

అడుగులో అడుగు వేసుకుంటూ కొండ ఎక్కుతున్నాడు అతను. కాని దారి అనడానికి వీల్లేదు దాన్ని. ఎప్పుడూ ఎవరూ ఎక్కి పైకి రారు. ఊరికి నాలుగు కోసుల దూరం. వారానికో, పదిరోజులకో ఓ పూజారి వస్తాడు. కొండ మీద ఓ గుడి. గోపురం లేని గుడి. ఎవరిదో విగ్రహం. నైవేద్యం పెడతాడు గావును ఆ దేవుడికి. అతను వచ్చినప్పుడు ఏదో తినడానికి ఇస్తాడు.

అతనికి దేవుడి గుడితో ఏమీ సంబంధం లేదు. అయినా ఆ కొండ మీదనే ఉంటాడు. గుడికివెనగ్గా ఓ చిన్నగది. గాలి, వెలుతురు బాగా లోపలికి రావటానికి భారీగా కిటికీలు. ద్వారం మటుకు చాలా చిన్నది. తలకాయ వంచితేగాని లోపలకు వెళ్లటానికి కుదరదు. కొండ లోపలికి ఉన్నట్లయితే దాన్ని 'గుహ' అనేవాళ్లు.

అతను ఈ గదిలోనే ఉంటాడు. అప్పుడప్పుడు కొండ దిగి కొంత మేరకు నడుచుకుంటూ తిరుగుతాడు. మళ్లీ విసుగు అనిపించినప్పుడు పైకి వచ్చేస్తాడు. ఏమీ తొందరలేదు. రోజులు బహు నిదానంగా నడచిపోతున్నాయి.

గది గుమ్మం దగ్గరే ఎవరో కూర్చుని ఉన్నట్లు అనిపించింది దూరానికి. ఎవరో దారి తెలియక ఇక్కడ చిక్కుకున్నాడేమో అనుకున్నాడు. అతను మరీ దగ్గరగా వచ్చినప్పుడు అంతసేపూ కూర్చుని వున్న మనిషి లేచి నిలబడ్డాడు.

కొత్తిగా నాలుగు అడుగులే ఇద్దరికీ మధ్య.

'నేను, అన్నా. గుర్తు పట్టలేదా?' అన్నాడు ఆ మనిషి.

అతడు ఎగాదిగా చూశాడు.

'ఎవరు? సుబ్బారావు?' అని అడిగాడు నిదానంగా. గాలిలోంచి వస్తున్నట్లుగా వున్నాయి ఆ మాటలు.

'అవును, సుబ్బారావునే. బాగా చిక్కిపోయావు అన్నా' అన్నాడు సుబ్బారావు.

చిక్కిపోయానా? ఎవరికి? అనుకున్నాడు అతను.

'ఇంటి దగ్గర అందరూ నిన్ను అడిగానని చెప్పమన్నారు. అందరూ కులాసాగా వున్నారన్నా. నువ్వు ఎట్లావున్నావు?' అన్నాడు సుబ్బారావు.

అతను జవాబు చెప్పలేదు.

గడ్డం బాగా మాసి వుంది. తల దువ్వుకున్నట్లే లేదు. జుట్టు జడలు కట్టలేదు గాని ఆ స్థితికి రావటానికి ఎంతో సమయం అక్కర్లేదు అనిపించేట్లు ఉంది.

'అద్దంలో చూసుకుంటున్నావా ఎప్పుడైనా?' అనడిగాడు సుబ్బారావు. అతని గొంతులో ఆదుర్దా, పుట్టెడు విచారం... ఇంకెన్నో అతనికి అక్కర్లేని భావాలు ధ్వనించాయి.

'గదిలోకి వచ్చి చూడు అన్నాడు' అతను లోపలకు వెళుతూ.

ఇద్దరూ గదిలో కూర్చున్నారు.

తుంగచాప మరోపక్క చిన్న దిండు. టీపాయ్ లాంటి చిన్న బల్లమీద ఏవో పుస్తకాలు... కాగితాలు. మరో మూల నీళ్ల కూజా. ఒకే ఒక్క గ్లాసు.

గోడకు ఓ పక్కగా అద్దం బిగించి ఉంది.

అద్దం మీద దుమ్ము, ధూళి లేవు. ఇప్పుడే ఎవరో తుడిచినట్లుగా శుభ్రంగా ఉంది.

'అన్నా, ఇంటికి రావా?' అన్నాడు సుబ్బారావు.

'ఎందుకు? ఇది ఇల్లే. ఇదీ ఈ లోకమే. ఎక్కడయితేనేం? ' అతను కళ్లు మూసుకునే జవాబు చెప్పాడు.

'ఎన్నాళ్లయింది నిన్ను చూచి! ఎప్పటికప్పుడే వద్దామనుకుంటే'

వాక్యం మధ్యలోనే అడ్డుపడ్డాడు అతను. 'ఎందుకు చూట్టం? బాగానే ఉన్నాగా. పూజారి చెబుతూనే ఉంటాడుగా మీకు ప్రతిసారీ...'

మళ్లీ కాసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

'నా చదువు పూర్తయిపోయింది' అన్నాడు సుబ్బారావు.

-నా చదువయితే ఇంకా మొదలే కాలేదు అనుకున్నాడు అతను మనసులోనే.

'బి.ఏ. అయినాక లైబ్రరీ సైన్స్ కోర్సు కూడా చేశాను. నీకు తెలుసు గదు అన్నా' అన్నాడు సుబ్బారావు.

తెలుసు అన్నట్లుగా తల ఊపాడు అతను.

'మన ఊళ్లోనే గవర్నమెంట్ లైబ్రరీలో పనిచేస్తున్నాను. రెండు నెలలు అయింది చేరి'

అతను మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

అతను ఒంటరివాడు కాడు. అన్న ఉన్నాడు, తమ్ముడూ వున్నాడు. ఇదిగో ఇక్కడ ఎదురుగా కూర్చున్న సుబ్బారావే తమ్ముడు.

అన్న కాంట్రాక్టులు చేస్తాడు. బాగా డబ్బు సంపాదించాడు. ఇంకా సంపాయిస్తున్నాడు. ఆయనకు పెళ్లి అయింది. పిల్లలు. పిల్లలు కూడా పెద్ద వాళ్లయి పెళ్లిళ్లు చేసుకుని సంసారాలు చేస్తున్నారేమో తెలియదు.

'అన్నా, ఈ రోజు నీ పుట్టినరోజు, ముప్ఫయి తొమ్మిది నిండిపోయి నలభయ్యో పడిలో పడిపోయినారని అమ్మ అనుకుంటుంది. అమ్మ నిన్ను తలుచుకోని రోజు లేదు అన్నా... నీకు మేం ఎన్నడూ గుర్తు రామా? మమ్మల్ని చూడాలని అనిపించదా? ఎట్లా వున్నామో. ఏం చేస్తున్నామో అడుగుదాం అని ఆలోచన రాదా? మేమంతా విరోధం అయిపోయినామా?'

విరోధమా? విహితం లేకపోతే విరోధమేనా? ఈ రెండూ కాకుండా ఉండే పరిస్థితి మనుషుల మనసులకు పట్టదా?... అనుకున్నాడు అతను.

'ఎందుకురా బేలగా అట్లా మాట్లాడతావు? ఇప్పుడేమయింది?' అన్నాడు పైకి, తమ్ముడిని సమాధానపరచటానికి.

'అన్న కంటే బోలెడు పని. నిన్ను గురించి విచారించడనుకో. వదిన మాత్రం కాకరకాయ వేపుడు చేసినప్పుడంతా నిన్నే తలుచుకుంటుంది, తెలుసా?'

అతనికి గుర్తు బాగానే తెలుసు. 'ఆమె మొదటి మారు కాకరకాయ కూరచేసినప్పుడు తనకు ఎక్కువ వడ్డించలేదు. చేదుగా వుంటుంది, అబ్బాయీ నువ్వు కొరకలేవు. కొద్దిగా రుచి చూడు అంతే అంది. తనకు మాత్రం చాలా రుచికరంగా వున్నది. మళ్ళీ మళ్ళీ అడిగి వేయించుకున్నాడు. వదిన కాకరకాయ కూర కంటే

వేపుడు బాగా చేస్తుంది అని అతనికి తెలిసింది. ఆ మాటే ఆమెతో అన్నాడు కూడా. కూరలో బెల్లం వేస్తే తనకు అస్సలు రుచించదు. వేపుడయితే కారం కారంగా బాగా తినొచ్చు.

పోనీలే కాకరకాయ వేపుడు పేరుతోనన్న నన్ను తలుచుకునే వాళ్ళు వున్నారు అనుకున్నాడు.

ఎవరు తలుచుకుంటే ఏం లాభం? అసలు తనకు ఏం కావాలని? ఏమీ అక్కర్లేదని ఇంత దూరం వచ్చి ఇక్కడ దాక్కున్నది?

అప్పుడు తీశాడు తమ్ముడు తను తెచ్చిన వస్తువులు... అంతవరకు వీపు వెనకాల దాచుకున్న చిన్న సంచీలో నుంచి.

'ఇదిగో ఈ పాయసం ఇచ్చింది అమ్మ. తాగు అన్నా' అన్నాడు. 'చేదు కాకరకాయ పంపిస్తే అమ్మ తిడుతుందని వదిన రహస్యంగా ఇచ్చింది ఈ పొట్లం. అమ్మే పంపించిందని చెప్పమంది వదిన. కాని నాకు నీతో అబద్ధం చెప్పడం చేతకాదు' అన్నాడు సుబ్బారావు.

అతను ఈ రెండు గిన్నెలవేపు నిరాసక్తంగా చూచాడు. తమ్ముడు వీటిని బల్లమీద పెట్టాడు జాగ్రత్తగా. 'నీకు కావలసినప్పుడు తినులే; అన్నా, తొందర లేదు' అన్నాడు. 'పిల్లల్ని తీసుకువద్దామనుకున్నాను. వాళ్లు బాబాయిని చూద్దామని ఒకటే ఆరాటం. కొండ ఎక్కడం కష్టం కదూ. వాళ్ళకు చెప్పకుండా నేను ఒంటిగా వచ్చేశాను'. కాసేపాగి 'నువ్వు చూస్తానంటే పై వారం తీసుకువస్తా సరేనా?' అన్నాడు.

'ఒద్దులే'

'మరి నువ్వే ఒకమారు కిందికి వచ్చి అందరినీ చూచి వెళ్లగూడదా, అన్నా. అందరూ ఎంత ఆనందిస్తారనుకున్నావు!'

'ఒరేయ్, ఇంకేదన్న విషయం మాట్లాడు' అన్నాడు విసుగ్గా అతను.

'పోనీలే అన్నా, నీకు ఇష్టం లేకపోతే మానె! మేం ఉన్నామని గుర్తు పెట్టుకో చాలు. అవునూ... నిన్ను గురించి మన ఊళ్లో అందరూ ఏమనుకుంటున్నారో ఎరికేనా?' అన్నాడు.

'ఏమనుకుంటున్నారు?' అని అడగలేదు అతను. ఎవరు ఏమి అనుకున్నా మనకేం ఒరిగేది లేదు, తరిగేది లేదు. కాని ఏమనుకుంటున్నారయ్యా అని అడుగుతున్నట్లే చూదాడు తమ్ముడివేపు.

'నీవు కోపం చేసుకోకు అన్నా. వాళ్లు ఏం అనుకుంటే ఏంలే' అన్నాడు తమ్ముడు మళ్లీ.

కోపమా? అంటే ఏమిటి అని అడుగుదామనుకున్నాడు అతను.

'వాళ్ళంతా అనేదేమంటే!... నువ్వు సన్యాసివైపోయావంటున్నారు. నీకు లోకం కనబట్టంలేదు. సంసారం అక్కర్లేదు. సన్యాసిలాగనే వుండిపోతావని చెప్పుకుంటున్నారన్నా' అన్నాడు సుబ్బారావు.

అతను జుట్టు చేత్తో సరిచూచుకున్నాడు.

తొడుక్కున్న చొక్కా సరిచేసుకున్నాడు.

కట్టుకున్న పంచ లైనుగా తడుముకున్నాడు.

సన్యాసి అయిపోయినాడని అనుకుంటున్నారా?... సన్యాసి అవటానికి ఎంత ధైర్యం, ఎంత గుండె కావాలి. తనకు చేతనవునా?...

ఎందుకు తనను గురించి మాట్లాడుకుంటారు వాళ్ళు అసలు?

సుబ్బారావు మనసుకు కష్టం అయినట్లుంది. 'నీకు చెప్పకూడదనే అనుకున్నాను. అన్నా, పోనీలే వాళ్ళమాటలు దేనికి?' అన్నాడు.

అతడు నడుం వాల్చాడు చాపమీదనే.

'నిద్రపోతావా అన్నా? నేను కిందికి పోయేదా?' అన్నాడు మళ్లీ.

'నీ ఇష్టం వచ్చినంత సేపూ కూర్చో. నాదేం పోయె! రాకరాక వస్తివి; వచ్చిన అలుసైనా తీరాల్నా వద్దా' అన్నాడు అతను.

తమ్ముడికి అతనికీ తొమ్మిదేళ్లవార.

అన్నకీ అతనికీ మూడేళ్లేవార.

అన్నకు ఈ తమ్ముడు ఏమయిపోయినాడో అక్కర్లేదు. తమ్ముడు మాత్రం వెదుక్కుంటూ వచ్చాడు. తమ్ముడికి తనేం చేయలేదు. ఎదురుగ్గా కూర్చున్న 'ఏంరా, ఎట్లా వున్నావు' అని కుశలమే అడగలేదు. అతడు చెప్పిందే వింటూ కూర్చున్నాడు. కొండమీద ఉన్నకొద్దీ తన మనస్సు కూడా బండబారుతోందా? పక్కనున్న గుడిలో బొమ్మకు తనకు వ్యత్యాసం ఏమీ లేదా?

అతను లేచి కూర్చున్నాడు.

మనసులో ఏదో మెదిలింది. కడుపులో ఏదో కదిలింది.

'తమ్ముడూ కాఫీ తాగుతావా?' అనడిగాడు.

'కాఫీయా అన్నా. ఇక్కడ కాఫీ చేసుకుంటావా నువ్వు. పాలు, పొడి...'

అతను జవాబు చెప్పలేదు. గదిలోనుంచి వెనక్కు వెళ్లాడు. గోడవారగ వున్న స్టౌ వెలిగించాడు. కిరసనాయిల్ స్టౌ. పాలపొడి నీళ్లలో కలిపి వెచ్చబెట్టాడు. ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్ కలిపి చెంచాతో కలయబెట్టాడు. రెండు చిన్న కప్పుల్లో మంచి వాసన వస్తున్న కాఫీ తయారు చేసి తీసుకువచ్చాడు.

తమ్ముడికో కప్పు ఇచ్చాడు. తనొకటి అట్టేపెట్టుకున్నాడు.

ఇద్దరూ హాయిగా తాగారు.

అతనికి చెబుదామనిపించింది తమ్ముడికి 'ఇక్కడ నేను బాగానే వున్నాను. నన్ను గురించి దిగులేం పెట్టుకోకండి ఎవరూ. నేను ఇక్కడ ఇక్కడే వుండిపోతాను. ఎవరూ నన్ను కిందకు పిలవకండి' అని.

'పూజారి బాబుతో తెప్పించుకుంటాను' నాకు కావలసినవన్నీ. అన్నీ ఏమున్నాయిలే. కాఫీపొడి, పంచదార, కిరసనాయిల్, బిస్కెట్లు... గుర్తు వచ్చినట్లుగా లేచి మళ్ళీ వెనక్కు వెళ్లి రెండు బిస్కెట్లు తెచ్చి తమ్ముడికి ఇచ్చాడు.

'ఈసారి మళ్ళీ వచ్చినప్పుడు అన్నీ తెచ్చిపెడతాలే అన్నా. నాకు తెలువదు. ఐస్‌క్రీం కూడా పట్టుకొస్తా నువ్వు వద్దనకుంటే' అన్నాడు సుబ్బారావు.

'తెప్పిస్తే నాకు అన్నీ అక్కర్లేదు, ఎప్పుడన్నా... కావాలనుకున్నప్పుడు ఇట్లానే కలుపుకు తాగుతాను. నాకేదీ తప్పనిసరి కాదు' అన్నాడు.

'ఒక్కడివే కూర్చుని ఏం చేస్తావన్నా? ఎవరన్నా చూడటానికి వస్తారా? నీ స్నేహితులు... తెలిసినవాళ్లూ...'

'ఎవరూ రారు. ఎవరూ లేరు'

'కాలం ఎలా గడుస్తుంది?'

'గడుస్తూనే వుంది కదా. నీకోసం, నా కోసం కాలం ఆగుతుందా?'

తండ్రి చిన్నప్పుడు అంటూ ఉండిన మాటలు గుర్తువచ్చాయి అతనికి. పాపం, సుబ్బారావుకు తండ్రి తెలియదు. వాడికి నిండా మూడేళ్లయినా రాకుండానే ఆయన ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆ తండ్రిలాగే తనకూ ఎప్పుడూ ఏదో ఆరాటం!'

'పుస్తకాలు ఏమన్నా తెచ్చేదా?'

'ఒద్దు. జీవితమే ఓ పుస్తకం. అదే చదువుతున్నాను' అన్నాడు అతను.

జీవితం ఊళ్లో, నగరాల్లో వుంటుందిగాని... ఇక్కడ ఈ అడవుల్లో, కొండల్లో వుంటుందా... అని ఆలోచనలో పడిపోయాడు సుబ్బారావు, తమ్ముడు.

'సరే నీ ఇష్టం'

అతను ఖాళీ గ్లాసులు కడిగి భద్రం చేసుకున్నాడు. సుబ్బారావు కడుగుతానంటే ఒప్పుకోలేదు. తమ్ముడిని అక్కడే విశ్రాంతిగా కూర్చోమన్నాడు.

'అన్నా' అన్నాడు తమ్ముడు ఏదో చెబుదామని.

'చెప్పు... చెప్పరా... ఎందుకు బిడియం' అన్నాడు అతను.

'నాకూ ముప్పయి దాటుతున్నాయి. పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నాను'

'చేసుకో. దానికేం?' అన్నాడు అతను.

పెద్దవాడివి నువ్వు అట్టేవుంటే ... నేను ఎట్లా చేసుకునేది?' అన్నాడు సుబ్బారావు బిడియంగా దిగులుగా.

'నేను ఉన్నానా? లేను కదరా! నీకు పెళ్ళి చేసుకుందామనిపిస్తే లక్షణంగా అలాగే చేసుకో. నాతో వంతు వద్దు. అమ్మతో చెప్పి... మంచి పిల్లను చూచుకుని...' అంటున్నాడు ఇంకా అతను. సుబ్బారావు అందుకుని అమ్మ ఒప్పుకుంది. అన్న, నాతోపాటు చదువుకున్న అమ్మాయి... నన్ను ఇష్టపడి చేసుకుంటానంది... నేనే తటపటాయిస్తున్నాను' అన్నాడు.

'నీకు ఇష్టం అయితే అట్లాగే చేసుకో తమ్ముడూ, నా కోసం చూడకు. అనవసరంగా' అన్నాడు నిక్కచ్చిగా అతను.

'అంతేనంటావా, అన్నా' అన్నాడు సుబ్బారావు నిస్పృహగా.

'ఎందుకురా దిగులు? నీకేం కావాలో అంతా చేసుకో అంటినిగా!' మరింత దృఢంగా అన్నాడు అతను.

'మన ఇల్లు మరీ చిన్నదయిపోయిందన్నా. నీ గదులన్నీ మూసివుంచింది అమ్మ. నువ్వు ఎప్పటికైనా తిరిగి వస్తావు.. ఆ గదులు నీకే వుండాలి అంటుంది. పోనీ, నువ్వు రా, అన్నా... అందరం అక్కడే వుందాం...' అన్నాడు సుబ్బారావు మురిపెంగా లాలనగా.

'ఒరే, మళ్ళీ మొదటికి వస్తున్నావురా! నేను సన్యాసినైపోయా గదరా; ఇంకా నాకా గదులెందుకు? అవన్నీ కూడా నువ్వే తీసుకో. ఇల్లంతా వాడుకోండిరా...

ఎప్పుడూ రానివాడికోసరం గదులెందుకురా...' అన్నాడు అతను.

తమ్ముడి కళ్ళు తడి అయినాయి.

అతడు మాత్రం చలించలేదు.

'నా మాట వినరా తమ్ముడూ! ఆ గదులన్నీ వాడుకోండిరా. నువ్వు పెళ్లి చేసుకో. అమ్మతో చెప్పు. నేను చెప్పానని...నా మాట కాదనకురా...' అని అదే పూనికతో తమకంతో అన్నాడు అతను.

తమ్ముడు కళ్ళు తుడుచుకున్నాడు, అన్నకు తెలియనీయకుండా.

ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు చాలా సేపు.

'పొద్దు వాలకముందే వెళ్లు ఇంటికి. చాలా దూరం పోవాలి గదా!' అన్నాడు అతను. ఆకాశంలో కిందికి జారదామని చూస్తున్న సూర్యుడిని అనాలోచితంగా చూస్తూ.

'ఈ రాత్రి ఇక్కడే వుంటాను. నీకు తోడుగా. తెల్లవారిన తరువాత వెడతా' అన్నాడు సుబ్బారావు.

'నాకు తోడా! నీకేం పిచ్చిగాని పట్టిందేమిట్రా? వెళ్లు... వెళ్లు... వేగం యింటికి చేరుకో' అని తరిమాడు తమ్ముడిని.

వెళ్ళిపోయే ముందు సుబ్బారావు ఇంకో విషయం కూడా చెప్పాడు :

'మన వూరు తులశమ్మగారి కూతురు సరోజమ్మ లేదూ? ఆమె కూతురికి మొన్న వారమే పెళ్ళి అయింది. నేను ఎరిగివుండగా అంత వైభవంగా మన వూళ్ళో పెళ్లి జరగడం ఇదే మొదలు... అంది అమ్మ ఆ రోజున' సుబ్బారావు ఇంకా పెళ్ళిని గురించి ఏవేవో వివరాలు చెబుతూనే ఉన్నాడు. కాని అతను మాత్రం ఇవేవీ పట్టించు కోవడం లేదు.

సరోజకు అప్పుడే పెళ్ళి ఈడు వచ్చిన అమ్మాయి! ఆ అమ్మాయికి పెళ్ళి అయితే వచ్చే ఏడాదికి కొడుకో, కూతురో సిద్ధం గదూ! సరోజ అమ్మమ్మ అయిపోతుంది... అతను ఈ ఆలోచనలో మునిగిపోయి మళ్లీ ఒకసారి జడలు కట్టబోతున్న జుట్టు చేతివేళ్ళతోనే దువ్వుకున్నాడు. రెండు చేతులతోను గడ్డం సవరించుకున్నాడు. ఆ మధ్యలోనే ఎప్పుడో తమ్ముడు సుబ్బారావు కొండదిగి వెళ్ళిపోయాడు.

❖